హలో.. ప్రాణాలు గాల్లో

- పెరిగిపోతున్న సెల్‌ఫోన్ డ్రైవింగ్‌లు
- రెప్పపాటులో కోల్పోతున్న వాహన నియంత్రణ
- రోడ్డు ప్రమాదాల్లో ఈ ఘటనలే అధికం
- కేసులు నమోదు చేసినా.. మారని తీరు

దాచేపల్లి: డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ మాట్లాడటం ద్విచక్ర వాహనదారుల ప్రాణాల మీదకు తెస్తోంది. రింగ్ అయిన ఫోన్ లిఫ్ట్ చేసి..హలో అనే లోపే బైక్ నియంత్రణ కోల్పోయి.. ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. రెప్పపాటు వ్యవధిలోనే ప్రమాదాలబారిన పడి విగతజీవులుగా మారుతున్నారు.తమ కుటుంబాలకు తీరని దుఃఖాన్ని మిగుల్చుతున్నారు.



సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్

> ఇటీవల కాలంలో దాచేపల్లి, పిడుగురాళ్ల మండలాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో చాలా వరకు మొబైల్ ఫోన్ మాట్లాడుతూ..డ్రైవింగ్ చేస్తున్న ఘటనలే. దాచేపల్లి మండల పరిధిలో ఇలాంటి కేసులు ఈ ఏడాది ప్రారంభం నుంచి మూడు వేలకు పైగా వచ్చినట్లు పోలీసు అధికారులు చెప్తున్నారు. ఇలా ఏటా సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న వారి సంఖ్య 10 నుంచి 20 శాతం మేర పెరుగుతోందని నివేదికలు చెప్తున్నాయి.

సెల్‌ఫోన్ డేంజర్... యమ డేంజర్

ద్విచక్ర వాహనం నడుపుతూ ఫోన్ మాట్లాడడం వల్ల డ్రైవింగ్ దృష్టి మరలుతుంది. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్నంత సేపు సంభాషణ మీదే ధ్యాస ఉంటుంది. దీంతో వెనుక, ముందు వచ్చే ఇతర వాహనాలను గమనించడం చాలా తక్కువ. ఈ క్రమంలో ఎదురుగా స్పీడ్ బ్రేకర్లు ఉన్నా..ఏదైనా వాహనం వచ్చిన నియంత్రణ కోల్పోవడం జరుగుతుంది. అదుపు తప్పి మరో వాహనాన్ని కొట్టడం, కింద పడిపోవడం లేదా రోడ్ సైడ్‌కు దూసుకుపోవడం జరుగుతుంది.

- ఇదంతా ఒక ఎత్తైతే.. ఒక చేతిలో సెల్‌ఫోన్.. మరోక చేతిలో ద్విచక్ర వాహనం హ్యాండిల్ లేదా కారు స్టీరింగ్ పట్టుకుని డ్రైవింగ్ చేస్తున్న వారిని గమనిస్తుంటాం. ఆకస్మికంగా ఫోన్ కిందపడిపోతుంటే పట్టుకునే ప్రయత్నంలో వాహనం అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్న ఘటనలు అనేకం.
- కొన్ని సందర్భాల్లో మొబైల్ మోగగానే ముందు వెనుక చూసుకోరు. ఒక్కసారిగా వాహనం ఆపి హాలో.. హాలో అంటుంటారు. దీంతో వెనుక నుంచి వచ్చే వాహనాలు వారిని ఢీకొంటున్నాయి.

శిరాఘాతమైన.. శిరస్త్రాణం వాడరు

గ్రామీణ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకం చాలా వరకు తగ్గించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తలకు హెల్మెట్ లేకపోవటం వల్ల ఎక్కువగా ద్విచక్ర వాహనదారులే ప్రాణాలను కొల్పోతున్నారు. ఇప్పటికైన పోలీసులు, రవాణ శాఖ అధికారులు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకుని విలువైన ప్రాణాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలి.

- ద్విచక్ర వాహనదారులు డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడుతున్న వారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. అయినా వాహనదారుల్లో మార్పురావడం లేదు. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని ప్రధాన కూడళ్లలో పోలీసులు తనిఖీలు చేస్తూ ఇలాంటి వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు

సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇలా పట్టుబడితో మొదటి సారి రూ.1,500, రెండవ సారి అదే వాహనంపై ఫోన్ మాట్లాడుతూ పట్టుబడితే రూ.10వేల వరకు జరిమానా ఉంటుంది.

– ఎం.శేషిరెడ్డి, ఎంవీఐ, మాచర్ల

తనిఖీలు చేస్తున్నాం

సెల్‌ఫోన్ డ్రైవింగ్‌లపై ప్రత్యేకంగా దృష్టిసారించాం. ప్రతి రోజు వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేసి సెల్‌ఫోన్ మాట్లాడుతూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తున్నాం. వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం.

– జి.పాపారావు, ఎస్ఐ, దాచేపల్లి

క్లుప్తంగా

కారెంపూడి వీఆర్వోగా దేవదాసు

కారెంపూడి: కారెంపూడి వీఆర్వోగా కోట దేవదాసు నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న వీఆర్వో కృష్ణప్రసాద్ దాచేపల్లికి బదిలీ అయ్యారు. అక్కడ పని చేస్తున్న దేవదాసు కారెంపూడి వీఆర్వోగా వచ్చారు. తహసీల్దారు ప్రసాద్‌ను కలసి జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చారు.

పోలీస్ అమర వీరుల త్యాగం చిరస్మరణీయం

మాచవరం: పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని ఎస్ఐ సతీష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా బుధవారం ర్యాలీ చేపట్టారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి మండపాల సెంటర్ వరకు ర్యాలీ కొనసాగించారు. విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసుల త్యాగాలను స్మరించుకుంటూ, వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ వ్యవస్థ నిత్యం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి


గురజాల : రెవెన్యూ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వీఆర్‌ఏ మండల అధ్యక్షుడు షేక్ ఇమావలి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డివిజన్ పరిధిలో 7 నైట్ వాచ్‌మెన్‌లు, 21 అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వాటిని సీనియార్టీ ప్రకారం వీఆర్‌ఏలకు ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ నాగరాజుకు వినతిపత్రం అందించారు. అలాగే గురజాల వీఆర్‌ఏల సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా షేక్ ఇమావలి, ప్రధాన కార్యదర్శిగా ఏడుకొండలు, సహాయ కార్యదర్శిగా సత్యవతి, కోశాధికారిగా పిచ్చయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని పలువురు ఉద్యోగులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



పిడుగురాళ్ల: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన ఘటన మండలంలోని జూలకల్లు అడ్డు రోడ్డులో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. ఘటనకు సంబంధించి ఎస్ఐ మోహన్ వివరాలు వెల్లడించారు. మండలంలోని జూలకల్లు గ్రామానికి చెందిన ఇర్లా నాగరాజు, సునిత, కుమారుడు రాజేష్ రెండేళ్ల నుంచి జీవనోపాధి కోసం రొంపిచర్ల మండలం అన్నవరపుపాడు గ్రామంలో ఉంటున్నారు. కొడుకు రాజేష్‌తో కలిసి సునీత తన తల్లికి డ్వాక్రా డబ్బులు ఇచ్చేందుకు ద్విచక్ర వాహనంపై జూలకల్లు గ్రామానికి వచ్చారు. రాజేష్(23) ఒక్కడే తిరుగు ప్రయాణం అయ్యాడు. జూలకల్లు అడ్డ రోడ్డు వద్దకు రాగానే కారంపూడి నుంచి గుత్తికొండ వైపు వెళ్లే ఆటో అతని ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. రాజేష్ రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయమైంది. అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. ఎస్ఐ మోహన్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాచవరం: సాగులో యాజమాన్య పద్ధతులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఏఓ కె.రామమ్మ అన్నారు. తురకపాలెం, ఆకురాజుపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. పంటల అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు అన్వర్ బాషా, కృష్ణవేణి పాల్గొన్నారు.

బ్లడ్ సెంటర్‌లో సర్వమత ప్రార్థనలు

నరసరావుపేట: స్థానిక 200పడకల ప్రభుత్వ వైద్యశాలలో నూతనంగా ప్రారంభం కాబోతున్న రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌లో రెడ్‌క్రాస్ చైర్మన్, మేనేజింగ్ కమిటీ సభ్యులు బుధవారం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చేనెల 10వ తేదీన బ్లడ్ బ్యాంక్ సెంటర్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ప్రజాప్రతినిధులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. వైస్ చైర్మన్ శరత్‌బాబు, కోశాధికారి మురళీకృష్ణ, మేనేజింగ్ కమిటీ మెంబర్స్ డాక్టర్ సృజన, డాక్టర్ రహమతుల్లా, సభ్యులు మాజీ కౌన్సిలర్ మస్తాన్‌వలి, జెల్లీ వీరారెడ్డి, జీవీఎస్ రాము, జిలానీ మాలిక్, బ్లడ్ సెంటర్ వైద్య అధికారులు డాక్టర్ మురళీధర్, డాక్టర్ రంగారావు, ఆర్ఎంవో ఏడుకొండలుపాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో ఓపెన్ హౌస్



మాచర్ల : రాష్ట్ర వ్యాప్తంగా పోలీసుల అమర వీరుల వారోత్సవం సందర్భంగా పట్టణంలోని పోలీసు స్టేషన్ సీఐ ప్రభాకరరావు, ఎస్సై సంధ్యారాణి ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సీఐ ప్రభాకరరావు మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రమశిక్షణ, పోరాట పటిమ కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీసుల విధులను వివరించారు. అమరులైన పోలీసులకు అక్టోబరు 21 నుంచి వారం రోజుల పాటు సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు చట్టం, పోలీసు వ్యవస్థతోపాటు, కేసుల వివరాలు, రాజీ, లోక్ అదాలత్, సెక్షన్లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏఎస్సై రమేష్, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు రెవెన్యూ సిబ్బంది సమావేశం

పిడుగురాళ్ల: గురజాల పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఈ నెల 25న రెవెన్యూ సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దారు ఎ.మధుబాబు బుధవారం తెలిపారు. మండలంలోని వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది సమావేశానికి ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు.

కరెంట్ కష్టాలు

పిడుగురాళ్ల: పట్టణంలోని 5వ వార్డుకు చెందిన పులిచింతల పునరావాస కాలనీలో విద్యుత్ కోతలు నిత్య కృత్యమయ్యాయి. అపరాధ రుసుం పేరుతో నగదు వసూలు చేస్తున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. కరెంట్ పోతే ఎప్పుడు వస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు సమస్యలను ఇంత వరకు పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొదటి ట్యాంక్ నాల్గొవ బజారులో గత మూడు నెలలుగా కరెంట్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో విద్యుత్ వైర్లు కాలిపోయి చుట్టూ ముళ్ల కంపతో నిండి ఉంది. అధిక లోడుతో మూడు నెలల నుంచి విద్యుత్ ఇలా..అలా పోతోందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు నిర్వహించి, కరెంట్ కోతలను నివారించాలని కోరుతున్నారు.



మరమ్మతుల నోచుకొని ట్రాన్స్‌ఫార్మర్



కాలిన కరెంట్ తీగలు

జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేసిన ఆర్ఐపీఈ

కారెంపూడి: స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్‌ను ప్రాంతీయ వ్యాయామ విద్య తనిఖీ అధికారి (ఆర్ఐపీఈ) డాక్టర్ మహబూబ్ బాషా బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పల్నాడు ప్రాంత వ్యాయామ ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. పాఠశాలలో క్రీడలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. మైదానాలను క్రీడలకు అనుకూలంగా మార్చాలని ఆదేశించారు. స్పోర్ట్స్‌కు సంబంధించిన రికార్డులు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి హెచ్ఎం పిన్నెల్లి వెంకటేశ్వర్లు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ప్రధాన కార్యదర్శి స్వర్ణరాజు, పీడీ శ్రీనివాసరావు, అసిస్టెంట్ స్కూల్ గేమ్స్ సెక్రటరీ రాధాకృష్ణమూర్తి, నియోజకవర్గ స్పోర్ట్స్ ప్రతినిధి నిర్సిరెడ్డి, జిల్లాలోని అన్ని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్ఐపీఈ డాక్టర్ మహబూబ్ బాషా

ప్రాంగణ ఎంపికలో 42 మందికి ఉద్యోగాలు

నరసరావుపేట రూరల్: బెంగుళూరుకు చెందిన అకాడెమోర్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 42 మంది విద్యార్థినులు ఉద్యోగాలు సాధించినట్టు ఎంఏఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ మేదరమెట్ల శేషగిరిరావు బుధవారం తెలిపారు. ప్రాంగణ ఎంపికలో భాగంగా విద్యార్థినులకు వ్రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేసినట్టు తెలిపారు. ఎంపికైన విద్యార్థినులకు మొదటి ఆరు నెలలు శిక్షణ ఇస్తారని, శిక్షణ కాలంలో నెలకు రూ.25 వేలు పరిమిత వేతనం చెల్లిస్తారని తెలిపారు. అనంతరం వార్షిక వేతనం రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు అందిస్తారని వివరించారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య, ప్రిన్సిపల్ డాక్టర్ సాదినేని రామారావు, ప్లేస్‌మెంట్స్ ఆఫీసర్ జె.రవిశంకర్, విభాగాధిపతులు రాధికా, సితార, నవీన్, అధ్యాపకులు అభినందించారు.



విద్యార్థులతో కళాశాల చైర్మన్ శేషగిరిరావు, డైరెక్టర్ శ్రావ్య

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు దిగుతాం

నరసరావుపేట: గత కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 29వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నట్లు పల్నాడు జిల్లా వైద్యమిత్ర అసోసియేషన్ నాయకులు చెప్పారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎన్‌టీఆర్ వైద్యసేవ సమన్వయకర్త జి.చంద్రశేఖర్‌ను కలిసి సమ్మె వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ గత 17 ఏళ్లుగా వైద్యమిత్రలుగా పనిచేస్తున్నప్పటికీ ఇప్పటికీ కనీస వేతనం, ఉద్యోగ భద్రత, ఒక క్యాడర్ అంటూ లేదని, ప్రస్తుతం మాకు ఇస్తున్న జీతం రూ. 15 వేలు మాత్రమేనన్నారు. తమకు ఎటువంటి సంక్షేమ పథకాలు కూడా లభించడం లేదని, ఎన్నిసార్లు ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసినా తమ సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించని పక్షంలో సమ్మెలోకి వెళ్తున్నట్లు చెప్పారు. మా 17 ఏళ్ల కాలాన్ని పరిగణలోకి తీసుకొని వైద్యమిత్రాలను కాంట్రాక్టు విధానంలోకి మార్చి కనీస వేతనం అమలు చేయాలని కోరారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు సాయిబాబురాజు, ఆంధ్రప్రదేశ్ దళిత గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.అప్పారావు, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్, జిల్లా సెక్రెటరీ శివ నాగేశ్వరరావు, సహ కార్యదర్శి సింగంశెట్టి వెంకటేశ్వర్లు, ట్రెజరీ అశోక్ పాల్గొన్నారు.



ఎన్‌టీఆర్ సమన్వయకర్త చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బైక్ మెకానిక్ మృతి

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్ మెకానిక్ మృతి చెందాడు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. వినుకొండకు చెందిన తిరుమలశెట్టి శ్రీనివాసరావు బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. తన స్నేహితులు శ్యామ్‌కుమార్, ఆంజనేయులతో కలిసి చీరాల బీచ్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. కోటప్పకొండకు వెళ్లేదారిలో మలుపులో బైక్ అదుపుతప్పి పల్టీ కొట్టింది. రోడ్డు పక్కకు పడిన శ్రీనివాసరావుకు తలకు రాయి తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మిగిలిన ఇద్దరికీ స్వల్పగాయాలయ్యాయి. రూరల్ ఎస్ఐ కిషోర్ కేసు నమోదు చేశారు.

పేదలకు వైద్య సేవలు అందాలి

జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

పిడుగురాళ్ల: పేదలకు వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందించాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. పట్టణంలోని మార్కెట్ యార్డులోని ప్రభుత్వ వైద్య శాలను బుధవారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులకు మెరుగైన వైద్య సేవలందించాలని, సుఖ ప్రసవం చేసి పంపాలన్నారు. వైద్య శాల భవనం నిర్మాణానికి సుమారు ఐదు ఎకరాల స్థలం కోసం..రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేశామని వైద్యురాలు ప్రభావతి కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. మత్తు డాక్టర్ సౌకర్యం కల్పించాలని, అపరేషన్ థియేటర్ సౌకర్యాలు కల్పించాలని విన్నవించారు. స్పందించిన కలెక్టర్ వైద్యశాల నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని త్వరలోనే పరిశీలించి, అందించేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఎ.మధుబాబుకు ఆదేశాలు జారీ చేశారు. వైద్యశాలకు కావాల్సిన సౌకర్యాలను వెంటనే కల్పిస్తామని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్, డాక్టర్ ప్రభావతి, పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు తదితరులున్నారు.



ప్రభుత్వ వైద్యశాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

మధ్యాహ్న భోజనం తనిఖీ

పిడుగురాళ్లరూరల్: మధ్యాహ్న భోజనం పాఠశాలలోఎందుకు తినడం లేదని విద్యార్థులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ప్రశ్నించారు. బ్రాహ్మణపల్లి జెడ్పీ ఉత పాఠశాలను ఆయన బుధవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. తరగతి గదులను, పరిసరాలను, పాఠశాల రిజిస్టర్లను పరిశీలించారు. 731 మంది విద్యార్థులకు 141 మంది గైర్హాజరుపై ఉపాధ్యాయులను ప్రశ్నించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పథకాన్ని పరిశీలిస్తుండగా అటువైపుగా క్యారేజీ బాక్స్‌లు తీసుకొని విద్యార్థినులు వెళ్తుండగా గుర్తించారు. భోజనం బాగుందా లేదా అని ప్రశ్నించారు. మధ్యాహ్న భోజనం పాఠశాలలో చేయాలని చెప్పారు. అండర్ ప్రాసెస్‌లో నీరు నిల్వ ఉంటోందని, విద్యార్థుల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని కలెక్టర్‌కు విన్నవించారు. హైవే అథారిటీ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. తహసీల్దార్ మధు, ఎంపీడీవో, ఏపీవో నాగ కోటేశ్వరరావు, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థినులను ప్రశ్నిస్తున్న జిల్లా కలెక్టర్

రామకృష్ణ సేవా సమితి అన్నదానం



మాచర్ల: స్వామి వివేకానంద బ్రదర్స్ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందురెడ్డి ఆధ్వర్యంలో నిత్య అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. బుధవారం ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, నెహ్రూ నగర్, రింగ్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో వందలాది మంది సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, ఆర్టీసీ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

నూతన మద్యం.. ఆఫీసులోనే వేద్దాం



కార్యాలయంలో మద్యం సేవిస్తున్న ఉద్యోగులు

పని చేస్తున్న కార్యాలయాన్నే బార్‌గా మార్చుకుని మద్యం సేవిస్తున్న ఘటన మండలంలోని గాదెవారిపల్లె విద్యుత్ సబ్ స్టేషన్‌లో బుధవారం వెలుగు చూసింది. సబ్ స్టేషన్‌లోనే ఉద్యోగులు మద్యం సేవించే దృశ్యాలు హల్‌చల్ చేయడంతో విద్యుత్ శాఖ గురజాల ఏడీఈ ఈ విషయంపై దర్యాప్తు చేస్తున్నారు.

– కారెంపూడి

రైలు కింద పడి ఆత్మహత్య

నరసరావుపేటటౌన్: రైలు క్రింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి పట్టణంలో చోటు చేసుకుంది. క్రిష్టియన్ పాలెం వద్ద అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలు క్రింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు నాయక్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం పడి ఉన్న ఆనవాళ్లను బట్టి ఆత్మహత్య చేసుకుని ఉంటా దని భావిస్తున్నారు. మృతుడు నలుపు రంగు గళ్ల చొక్కా, నలుపు రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్య శాలకు తరలించారు. మృతుడి వద్ద విజయవాడ నుంచి నరసరావుపేట రైల్వే టికెట్ లభ్యమైంది.

విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించాలి

బాలల హక్కుల పరిరక్షణ నిర్వహణ కమిటీ సభ్యురాలు పద్మావతి

చిలకలూరిపేట: ఉపాధ్యాయులు విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించి సత్వర పరిష్కారం చూపాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ నిర్వహణ కమిటీ సభ్యురాలు బత్తుల పద్మావతి చెప్పారు. మండలంలోని పోతవరం గ్రామంలో ఉన్న కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులు జ్వరాలతో బాధపడుతున్న విషయం తెలుసుకొని డీఎంఅండ్ హెచ్‌వోకు ఫోన్ చేసి ప్రతి నెలా విద్యాలయంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వంట చేసే సిబ్బంది పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పట్టణంలోని శారదా జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.



బత్తుల పద్మావతికి వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థులు

విద్యార్థులు ఆమెతో మాట్లాడుతూ క్రమశిక్షణా చర్యల పేరున టీసీలు ఇచ్చి పంపుతున్నారని ఫిర్యాదు చేశారు. డ్రాప్ అవుట్‌లో పేరు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆమె ఉపాధ్యాయుల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు టీసీ ఇచ్చి పంపటం అంటే వారి హక్కులను హరించి వేయడమేనని హెచ్చరించారు. ఇదే విషయాన్ని ఫోన్ ద్వారా డీఈవో దృష్టికి తీసుకువెళ్లారు. ఆమె వెంట సీడీపీవో శాంతకుమారి ఉన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు



రెంటచింతల: రైతులకు ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మాచర్ల ఏడీఏ వి.జగదీశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఏఓ బోయపాటి బ్రహ్మరెడ్డితో కలిసి స్థానిక ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో అకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపుల్లో ఉన్న ప్రతి ఎరువుకు, పురుగు మందులకు ఖచ్చితంగా సీపీలు కలిగి ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు స్టాకు క్రయ, విక్రయాల సమాచారం రికార్డుల్లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. బిల్లులో తేదీ, బ్యాచ్, లాట్ నంబర్లు నమోదు చేసి ఇవ్వాలని చెప్పారు.